నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, ఆదివారం 7 జనవరి 2024 | KARIMNAGAR

• వలస కూలీలతో వరి నాట్లు

కోనరావుపేట మండల వ్యాప్తంగా యాసంగి పనులు జోరుగా సాగుతున్నాయి. రైతులు పొలాల్లో వరినాట్లు వేయడంలో బిజీబిజీగా మారారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా బిహార్, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాలకు చెందిన కూలీలు వలస వచ్చి నాట్లు వేస్తున్నారు. స్థానికంగా కూలీల కొరత ఉండడం, ఎక్కువ కూలి అడుగుతుండడంతో వలస కూలీలతో రైతులు నాట్లు వేయిస్తున్నారు. దీంతో వరినాట్లు ఊపందుకున్నాయి. -కోనరావుపేట, జనవరి 6

మెగా డీఎస్సీకి ప్రమోషన్ల అడ్డంకి?

- ఉద్యోగోన్నతుల ప్రక్రియ పూర్తయితేనే కొత్త ఖాళీలు
- న్యాయపరమైన చిక్కులు తొలగితేనే పోస్టులు పెరిగే అవకాశాలు
- సాధ్యాసాధ్యాలపై సమాలోచనలు
- టెట్ అర్హత పెద్ద అడ్డంకిగా మారుతుందనే అభిప్రాయాలు
- ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపై ఉత్కంఠ

మెగా డీఎస్సీకి ఏర్పాట్లు చేయాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశించడంతో అభ్యర్థుల్లో ఆశలు పెరుగుతున్నాయి. పోస్టులు పెద్ద సంఖ్యలో ఉంటాయని భావించి పుస్తకాలతో కుస్తీ పట్టే వారి సంఖ్య పెరుగుతుండగా, ఈ మెగా డీఎస్సీకి ప్రమోషన్ల ప్రక్రియ అడ్డుపడే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఉద్యోగోన్నతులు పూర్తి కావాలంటే.. టెట్ విధిగా నిర్వహించాల్సి ఉండగా.. ఇప్పటికిప్పుడు ఇది సాధ్యం కాదన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. పదోన్నతులు కల్పించపోతే.. పోస్టుల ఖాళీలు పెరిగే అవకాశాలు లేకపోగా, ఆదిలోనే ఆటంకాలు ఎదురవుతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కరీంనగర్, జనవరి 6 (నమస్తేతెలంగాణ ప్రతినిధి) : రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయులకు ఉద్యోగోన్నతులు, బదిలీలు నిర్వహించేందుకు కేసీఆర్ సర్కారు గతేడాది సెప్టెంబర్ 3న షెడ్యూల్ విడుదల చేసింది. ఆ ప్రకారం చూస్తే.. సెప్టెంబర్ 3 నుంచి అక్టోబర్ 3 వరకు కొనసాగాల్సి ఉన్నది. నిజానికి ఈ ప్రక్రియ అంతా సజావుగా సాగేందుకు గత ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకున్నది. ఈ క్రమంలోనే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో భారీగా ప్రమోషన్లు వస్తాయని ఆశించారు. అప్పటి అంచనాల మేరకు దాదాపు 1200 మంది ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు వచ్చేవి. అలాగే ల్యాంగేజ్ పండితులు, పీఈటీలకు సైతం ప్రమోషన్లు వచ్చేవి. కానీ, జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సీటీఈ) నిబంధనల ప్రకారం ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) అర్హత సాధించిన వారికే పదోన్నతులు ఇవ్వాలని పలువురు టీచర్లు హైకోర్టును ఆశ్రయించడంతో ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది. ప్రమోషన్లు పొందేందుకు టెట్ ఉత్తీర్ణత సాధించిన వారితో సీనియారిటీ జాబితా సమర్పించాలని గతేడాది సెప్టెంబర్ 27న హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడంతో ప్రభుత్వం ముందుకెళ్లలేని పరిస్థితి ఏర్పడింది.

అడ్డంకులు తొలిగితేనే అదనపు పోస్టులు

నిజానికి కేసీఆర్ ప్రభుత్వం గతేడాది ఆగస్టు వరకు ఉన్న ఉపాధ్యాయ ఖాళీలను గుర్తించింది. అందులో భాగంగా డీఎస్సీ నిర్వహించేందుకు రాష్ట్రంలో 5,089 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్రంలో చూస్తే 1,739 స్కూల్ అసిస్టెంట్‌లు, 611 భాషా పండిట్లు, 164 వ్యాయామ ఉపాధ్యాయులు, 2,575 సెకండరీ గ్రేడ్ టీచర్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ మేరకు ఉమ్మడి జిల్లాలో 393 పోస్టులకు ఇచ్చింది. అందులో 125 ఎస్ఏలు, 176 ఎస్జీటీలు, భాషా పండితులు 72, 20 పీఈటీ పోస్టులు ఉన్నట్టు చూపింది. జిల్లాల వారీగా చూస్తే.. కరీంనగర్ జిల్లాలో 99, జగిత్యాల జిల్లాలో 148, పెద్దపల్లి జిల్లాలో 43, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 103 పోస్టులు ఉన్నట్టు ప్రకటించింది. ఈ పరిస్థితుల్లోనే ఎన్నికలు రావడంతో డీఎస్సీ నిలిచిపోయింది. కాగా, ప్రస్తుతం మెగా డీఎస్సీ నిర్వహించాలని కొత్త ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. అందుకోసం ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖాధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అయితే, మెగా డీఎస్సీ అంటే పోస్టులు ఎక్కువగా ఉంటాయని సహజంగానే అందరూ భావిస్తున్నారు. పుస్తకాలతో కుస్తీ పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. అయితే, అడ్డంకులను అధిగమిస్తే తప్ప అదనంగా ఖాళీలు ఏర్పడే పరిస్థితులు కనిపించడం లేదు. ప్రస్తుతం సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడం ప్రభుత్వం ముందు ప్రధానంగా ఉన్నది. దీని కోసం ఇప్పటికే టెట్ అర్హత సాధించిన ఉపాధ్యాయులు పోరాడుతున్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం చూసినా, ఎన్‌సీటీఈ ఆదేశాల పరంగా చూసినా.. టెట్ ఉత్తీర్ణత సాధించిన వారికే మాత్రమే ప్రమోషన్లు ఇవ్వాలని ఉందని, ఆ నిబంధనలను విస్మరించకుండా పదోన్నతుల ప్రక్రియను చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే ఈ విషయంలో సదరు టీచర్లు కోర్టును కూడా ఆశ్రయించారు. ఈ సమస్యకు పరిష్కారం చూపకుండా ప్రభుత్వం ముందుకెళ్లే పరిస్థితి కనిపించడం లేదు. అలాగే పరిష్కారం అంతా సులభం కాదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిజానికి ఇది పరిష్కారమైతేనే ఉమ్మడి జిల్లాలో అదనంగా పోస్టులు పెరిగే అవకాశాలున్నాయి. ఇప్పుడు న్యాయపరమైన చిక్కులు, అడ్డంకులను అధిగమించి పదోన్నతులు ఇవ్వగలిగితే.. అధికారుల లెక్కల ప్రకారం సుమారు 1200 ఎస్జీటీలకు ఉద్యోగోన్నతులు వచ్చే అవకాశమున్నది. లాంగ్వేజ్ పండిట్‌లు, పీఈటీల పరిస్థితి కూడా ఇదే. డిమాండ్లు పరిష్కారమైతే వాటన్నింటినీ కొత్తగా ఖాళీలుగా చూపడానికి ఆస్కారముంటుంది. ప్రభుత్వం ప్రమోషన్ల ప్రక్రియ సజావుగా పూర్తిచేస్తే.. ఉమ్మడి జిల్లాలో కొత్తగా ఎస్జీటీలు, పీఈటీలు, లాంగ్వేజ్ పండితులు కలిపి సుమారు 1200 నుంచి 1500 వరకు కొత్తగా ఉపాధ్యాయ ఖాళీలు ఏర్పడే అవకాశం ఉన్నది.

ప్రభుత్వం నిర్ణయంపై ఉత్కంఠ

మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటించడం వరకు బాగానే ఉన్నా.. ఈ విషయంలో తీసుకునే నిర్ణయాలు ఎలా ఉంటాయన్న దానిపై ఉత్కంఠ నెలకొన్నది. కొత్తగా డీఎస్సీకి ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులతో పాటు సర్వీసులో కొనసాగుతున్న ఉపాధ్యాయుల్లోనూ టెన్షన్ కొనసాగుతున్నది. టెట్ అర్హత తప్పనిసరని నిబంధనలు స్పష్టం చేస్తున్న నేపథ్యంలో సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం టెట్ నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పుడే పదోన్నతులకు లైన్ క్లియర్ అయ్యే అవకాశమున్నది. ఇప్పటికిప్పుడు టెట్ నిర్వహిస్తామంటే.. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు ఒప్పుకునే పరిస్థితి కనిపించడం లేదు. టెట్ నిర్వహించకుండా పదోన్నతులకు వెళ్తే టెట్ అర్హత సాధించిన టీచర్లు ఊరుకునే పరిస్థితి లేదు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఎలా ముందుకెళ్తుందన్న అంశంపై మాత్రం అన్ని వర్గాల్లోనూ చర్చ సాగుతున్నది.

8 రోజులు.. 11,58,263 దరఖాస్తులు

ఆఖరి రోజే 1,28,790

ఉమ్మడి జిల్లా పరిధిలో ప్రజాపాలనకు వచ్చిన దరఖాస్తులు		
జిల్లా	చివరి రోజు	మొత్తం
కరీంనగర్	34,881	3,54,363
జగిత్యాల	36,303	3,60,923
సిరిసిల్ల	40,157	1,90,965
పెద్దపల్లి	17,449	2,52,012
మొత్తం	1,28,790	11,58,263

- వెల్లువెత్తిన అప్లికేషన్లు
- నిత్యం కేంద్రాల వద్ద బారులు
- మొదట్లో ఫారాల కోసం తిప్పలు
- అర్జీ పూరించడంలో అనేక అనుమానాలు

ఆరు గ్యారెంటీల కోసం ప్రజల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఎనిమిది రోజుల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 11,58,263 అప్లికేషన్లు వచ్చాయి. కేవలం ఆఖరి రోజే 1,28,790 దరఖాస్తులు వచ్చాయి. గత నెల 28న ప్రారంభం కాగా, రెండు సెలవు రోజులు పోనూ ఈ నెల 6 వరకు దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగింది. మొదట్లో దరఖాస్తు ఫారాల కోసం ప్రజలు తిప్పలు పడగా, కేంద్రాల వద్ద తగిన ఏర్పాట్లు లేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది.

ఎల్లారెడ్డిపేటలో ఆన్‌లైన్ చేస్తున్న దరఖాస్తులను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ గౌతమి

కరీంనగర్, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా 'ప్రజా పాలన'కు శ్రీకారం చుట్టింది. ఆరు గ్యారెంటీలకు సంబంధించి గత డిసెంబర్ 28 నుంచి ఈ నెల 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించింది. సెలవు రోజులు డిసెంబర్ 31, జనవరి ఒకటో తేదీ మినహా ఎనిమిది రోజుల పాటు ప్రతి రోజూ అర్జీలు తీసుకున్నది. అయితే ఈ ఎనిమిది రోజుల్లో దరఖాస్తులు వెల్లువలా రాగా, మొదటి రోజు నుంచి చివరి రోజు దాకా ఎక్కడ చూసినా ప్రజలు బారులు తీరి కనిపించారు. మొదట్లో అంతా గందరగోళానికి గురయ్యారు. దాదాపు అంతటా దరఖాస్తులు ప్రతులు అందక ఇబ్బంది పడ్డారు. గామ సభలకు ఒక రోజు ముందే ఫారాలు అందుబాటులో ఉంచాలని ప్రభుత్వం ఆదేశించినా ఉంచలేకపోయారు. దాంతో చాలా మంది జిరాక్స్ సెంటర్లకు పరుగులు తీసి, ₹20 నుంచి ₹40 వరకు వెచ్చించి మరీ కొనుగోలు చేశారు. ఈ అప్లికేషన్లను పూరించే క్రమంలో అనేక సందేహాలు వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీలకు ఒకే దరఖాస్తు ఇవ్వడం, అందులో చాలా వాటికి సంబంధించి క్లారిటీ లేకపోవడంతో ఆగమయ్యారు. ఎవరిని అడుగాలో తెలియక.. ఎలా నింపాలో అర్థంకాక అయోమయానికి గురయ్యారు. ఎవరికి తోచిన విధంగా వాళ్లు తమ ధ్రువపత్రాలను జత చేసి అందించారు. మరోవైపు ప్రతి రోజూ కేంద్రాలకు జనం పోటెత్తారు. చివరి రోజూ అయితే వేలాదిగా తరలివచ్చారు. సభలు ముగిసినా బారులు తీరారు. ఎనిమిది రోజుల్లో మొత్తం 11,58,263 అప్లికేషన్లు వస్తే.. మొదటి రోజు 94,530, చివరి రోజు 1,28,790 దరఖాస్తులు సమర్పించారు. అర్జీల స్వీకరణ ముగియడంతో ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఇప్పటికే చేపట్టారు. అప్‌లోడ్‌ను 17లోగా పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించగా, ఆ లోగా పూర్తి చేసేందుకు వేగవంతం చేశారు.

కోలనౌటీ: రామగుండంలో ప్రజాపాలన దరఖాస్తులను సమర్పించేందుకు బారులు తీరిన ప్రజలు

విద్యుత్ అధికారులు, సిబ్బందికి సూచనలు చేస్తున్న ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి

- ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలను నియంత్రించాలి
- ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి

కరీంనగర్ ముకరంపుర, జనవరి 6: క్షేత్రస్థాయిలో ట్రాన్స్ ఫార్మర్స్ వైఫల్యాలను నియంత్రించి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు కృషి చేయాలని అధికారులను ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఆదేశించారు. కరీంనగర్ సర్కిల్ కార్యాలయ సమావేశం మందిరంలో శనివారం అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డీటీఆర్ ఫెయిల్యూర్స్‌ను తగ్గించాలని, లైన్లను సక్రమంగా మెయింటనెన్స్ చేస్తూ వినియోగదారులకు నాణ్యమైన సరఫరా చేయాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్స్ దెబ్బతినకుండా మెయింటనెన్స్ చేస్తూ విద్యుత్‌ను ఆదా చేస్తూ వ్యవసాయానికి నిరంతర పవర్ అందించాలని సూచించారు. నిర్దేశిత లక్ష్యం మేరకు రెవెన్యూ వసూళ్లను రాబట్టాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు విద్యుత్ రాయితీపై అవగాహన కల్పించాలని, మీటర్లను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, లోపాలను గుర్తించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో విద్యుత్ బిల్లుల చెల్లింపుపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని కరీంనగర్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల్లో తీసుకుంటున్న జాగ్రత్తలు, మెయింటనెన్స్ గురించి అడిగి తెలుసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, మెటీరియల్ సప్లై విషయంలో ఎలాంటి ఆరోపణలకు ఆస్కారం లేకుండా ఉండాలన్నారు. అనంతరం నేరుగా కరీంనగర్ రూరల్ ఈఆర్వో కార్యాలయాన్ని సందర్శించారు. అలాగే ఇండోర్ స్టేడియాన్ని పరిశీలించి, పలు పోటీల్లో బహుమతులు సాధించిన విద్యుత్ శాఖ క్రీడాకారులను, కళాకారుడైన విద్యుత్ ఉద్యోగి మంచాల రమేశ్‌ను సీఎండీ అభినందించారు. అనంతరం తెలంగాణ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించి, అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో డైరెక్టర్లు బీ వెంకటేశ్వరరావు, మోహన్ రెడ్డి, సంధ్యారాణి, గణపతి, సీజీఎంలు అశోక్ ప్రభాకర్, వేణుబాబు, ఎస్ఈ వడ్లకొండ గంగాధర్, డీఈలు విజయేందర్ రెడ్డి, చంద్రమౌళి, కాళిదాసు, లక్ష్మిరెడ్డి ఉన్నారు.

వరదకాలువ నీటికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

వరదకాలువకు నీటి విడుదల

మల్యాల, జనవరి 6 : ఎస్సారెస్పీ ప్రాజెక్టును నుంచి వరద కాలువకు శనివారం అధికారులు 2000 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మండలంలోని రాంపూర్ పంప్‌హౌస్-1లోని గేట్లు ఎత్తి దిగువకు వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరదకాలువలో 0.2 టీఎంసీల నీరుందని, అధికారులు 2000 క్యూసెకులు విడుదల చేశారని, కాలువలో నీళ్లు నింపడంతో పాటు తూముల ద్వారా ఆయకట్టుకు అందిస్తామన్నారు. అనంతరం పంప్‌హౌస్ నమూనా, పనితీరును అధికారులు ఎమ్మెల్యేకు వివరించారు. వరదకాలువకు మోటర్లు ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయడం లేదని, ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపాలని నూకపల్లికి చెందిన రైతులు ఎమ్మెల్యేకు విన్నవించగా ఎస్ఈతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఇక్కడ డీఈఈ తిరుపతి, ఏఈఈలు రాజశేఖర్, నాయకులు పుల్కం నర్సయ్య, దారం ఆదిరెడ్డి, వెల్మ లక్ష్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వినోద్.. మచ్చలేని మనిషి

- ఆయనకు అసలు సోదరుడే లేడు
- అన్న కూతురికి ఉద్యోగం ఎలా ఇప్పిస్తడు
- రాజకీయంగా ఎదుర్కొలేకే దుష్ప్రచారం
- గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ ఫైర్
- అసత్య ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టూటౌన్‌లో ఫిర్యాదు

పోలీస్‌స్టేషన్ ఎదుట గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్, బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్ రాంనగర్, జనవరి 6: నేటి రాజకీయాల్లో నిజాయితీగా పనిచేసిన మచ్చలేని, మహామనిషి మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్ అని కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ కొనియాడారు. రాజకీయాల్లో ఎలాంటి కల్మషం లేని వ్యక్తిగా ఆయనకు పేరున్నదని, నిజాయితీగా ఉంటూ గెలుపోటములకు అతీతంగా పట్టుదలతో పని చేసిన వ్యక్తిగా ప్రజలందరికీ తెలుసని గుర్తు చేశారు. అలాంటి వ్యక్తి గురించి అసత్య ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఆర్ఎస్‌వీ నగర అధ్యక్షుడు కుర్దీప్, బీఆర్ఎస్ నాయకులతో కలిసి శనివారం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 'వినోద్‌కుమార్ సోదరుడి కుమార్తెకు జెన్‌కోలో అప్పటి సీఎండీ ప్రభాకర్‌రావు ఏఈ ఉద్యోగం ఇచ్చారు. లక్షన్నర జీతం తీసుకుంటూ ఇంట్లోనే ఉంటున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం పోగానే విధుల్లో చేరింది' అంటూ విశాల్ హిందూ ఫేస్‌బుక్ ఐడీ పేరిట పోస్టు చక్కర్లు కొట్టగా.. పలు పోస్టులు సామాజిక మాధ్యమాల్లో శనివారం ఉదయం నుంచి వైరల్ అయ్యాయి. దీనిపై బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు భగ్గుమన్నారు. తప్పుడు ఐడీలు సృష్టించి ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని లిఖిత పూర్వకంగా టూటౌన్‌లో ఫిర్యాదు చేశారు. ఆరోపణల్లో ఎంత మాత్రం నిజం లేదని, అసలు వినోద్ కుమార్‌కు సోదరుడే లేడని అందులో స్పష్టం చేశారు. వినోద్‌కుమార్‌ను, బీఆర్ఎస్‌ను బద్నాం చేయాలనే ఇలాంటి అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

వినోద్‌కుమార్‌కు అన్న ఎవరూ లేరు

కొత్తపల్లి, జనవరి 6 : వినోద్ కుమార్‌కు అన్న అంటూ ఎవరూ లేరని, అలాంటప్పుడు అన్న కూతురికి విద్యుత్ శాఖలో ఉద్యోగం ఇప్పించి జీతం ఇప్పిస్తున్నారని చెబుతున్న ఆరోపణలు పూర్తి అసత్యాలేనని కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్‌రెడ్డి, సుడా డైరెక్టర్ భూక్య తిరుపతినాయక్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. నీతి, నిజాయితీకి మారుపేరు వినోద్‌కుమార్ అని, ఆయన రాజకీయ జీవితంలో ఎప్పుడూ అవినీతికి పాల్పడలేదన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన కొందరు నాయకులు సోషల్ మీడియా వేదికగా ఇలాంటి అసత్యపు ఆరోపణలు చేయడం సరికాదని హితవు పలికారు. దమ్ము ధైర్యం ఉంటే ఆయనపై ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందాలని సవాల్ విసిరారు. ఆరోపణలపై వెంటనే క్షమాపణలు చెప్పకపోతే తరిమి కొడతామని హెచ్చరించారు.

మెట్‌పల్లిలో నినాదాలు చేస్తున్న ఆటో డ్రైవర్లు

ఆటో డ్రైవర్ల భిక్షాటన

- మెట్‌పల్లిలో వినూత్న నిరసన
- సర్కారు ఆదుకోవాలని డిమాండ్
- తహసీల్దార్ వినతిపత్రం అందజేత

మెట్‌పల్లి, జనవరి 6: ఆటో డ్రైవర్లు కదంతొక్కారు. కాంగ్రెస్ సర్కారు మహిళలకు ఆర్టీసీలో ఫ్రీజర్నీ కల్పించి తమ బతుకులను రోడ్డుపాలు చేసిందంటూ రోడ్డెక్కారు. శనివారం మెట్‌పల్లిలో నవయువ తెలంగాణ డ్రైవర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినూత్నంగా నిరసన తెలిపారు. ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, మల్లాపూర్ మండలాలకు చెందిన ఆటో డ్రైవర్లు పాత బస్టాండ్ నుంచి కొత్త బస్టాండ్ మీదుగా భిక్షాటన చేస్తూ తహసీల్ ఆఫీస్ వరకు ర్యాలీగా వెళ్లారు. రోడ్డుపై భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడారు. ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో తమ ఆదాయం గణనీయంగా పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం ఆటోలకు ఈఎంఐలు కట్టేపరిస్థితి లేదని వాపోయారు. తాము బతుకుడు కష్టంగా ఉన్నదని, ప్రభుత్వం తమను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్స్ యూనియన్ జగిత్యాల జిల్లా అధ్యక్షులు శివలాల్ నాయక్, కార్యదర్శి రంగు సంపత్, నాయకులు గణేశ్, రామయ్య, గంగాధర్, శంకర్, గట్టయ్య, నవాబ్, నర్సయ్య, రవి, గంగాధర్, సంతోష్, రాజు, వసంత్, గంగాధర్, పాషా, షఫీ, లక్ష్మణ్, మొగిలి, నరేందర్, ఐలయ్య, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లస్ హోదా గర్వకారణం

మేయర్ యాదగిరి సునీల్ రావు

పారిశుధ్య కార్మికులకు స్వీటు తినిపిస్తున్న మేయర్ సునీల్ రావు

కార్పొరేషన్, జనవరి 6 : కరీంనగర్ నగరపాలక సంస్థ వాటర్ ప్లస్ హోదా దక్కించుకోవడం గర్వకారణమని మేయర్ యాదగిరి సునీల్‌రావు సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో సంబురాలు జరుపుకున్నారు. పాలకవర్గ సభ్యులు, పారిశుధ్య కార్మికులు, సిబ్బందికి మేయర్, కమిషనర్ స్వీట్లు తినిపించారు. కార్మికులకు మేయర్ పూల మొక్క ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర ప్రజలు, పాలకవర్గ సహకారం, పారిశుధ్య కార్మికులు, సిబ్బంది కృషి ఫలితంగానే ఉత్తమ అవార్డులు, హోదాలు దక్కుతున్నాయని తెలిపారు. పాలకవర్గం, అధికార యంత్రాంగాన్ని ఎమ్మెల్యేలు కేటీఆర్, గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రశంసించారని, ప్రత్యేక అభినందనలు తెలిపారని చెప్పారు. అన్ని కేటగిరిల వారీగా పారిశుధ్య వ్యవస్థను మొరుగుపరిచినందుకే వాటర్ హోదా వచ్చిందన్నారు. గతంలోనే ఓడీఎఫ్, ఓడీఎఫ్+, ఓడీఎఫ్++ రావడంతోపాటు సఫాయి మిత్ర సురక్షా చాలెంజ్‌లో దేశంలో మంచి ర్యాంకు సాధించి రూ.4 కోట్ల ప్రైజ్ మనీ పొందినట్లు గుర్తు చేశారు. ఇప్పుడు వాటర్ ప్లస్ రావడం గొప్ప విషయమన్నారు. ఇంత మంచి హోదా దక్కడానికి మా మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, అప్పటి కలెక్టర్, అదనపు కలెక్టర్‌ల సహకారం ఉందని కొనియాడారు. రాబోయే రోజుల్లో మొత్తం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఎస్టీపీకి అనుసంధానం చేసి 99 శాతం మురుగు నీరు శుద్ధీకరణ అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. డంపింగ్ యార్డు సమస్య నుంచి ప్రజలకు త్వరలోనే విముక్తి లభిస్తుందని, 24 గంటల మంచి నీటి సరఫరా ప్రాజెక్టు ట్రయల్‌రన్ ప్రారంభిస్తామని తెలిపారు. సమావేశంలో కార్పొరేటర్లు నేతికుంట యాదయ్య, బుచ్చిరెడ్డి, దిండిగాల మహేశ్, బోనాల శ్రీకాంత్, ఎదుల్ల రాజశేఖర్, బండారి వేణు, భూమాగౌడ్, కుర్ర తిరుపతి, ఆకుల నర్మద నర్సయ్య, తుల రాజేశ్వరి బాలయ్య, సల్ల శారద రవీందర్, వంగల శ్రీదేవి పవన్, లెక్కల స్వప్న వేణు, సానిటేషన్ సూపర్ వైజర్ రాజమనోహర్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ స్వామి పాల్గొన్నారు.